# అభాగ్యురాలు

శ్రీమతి దొంతంశెట్టి మల్లేశ్వరీదేవి

★

గడియారం పన్నెండు గంటలు కొట్టింది. అంతా నిశ్శబ్దంగావుంది. మా యిరుగుపొరుగు ప్రజలంతా మంచి నిద్రలో వున్నారు. కాని, నాకవాళ అప్పటి వరకూ నిద్రరాలేదు. గదిలో లైటు పెద్ద వెలుతురుతో వెలుగుతూనేవుంది. గదిలో టేబిలు ముందు కుర్చీలో కూర్చొని అప్పటివరకూ యేదో పుస్తకం చదువుతూనే వున్నాను. గడియారంచూచి అప్పటికి చాలా రాత్రయిందని గుర్తించాను. అప్పటికీగూడా యిక నిద్రరాకపోవడంతో యిక బలవంతంగానైనా నిద్రపోవాలని పుస్తకంమూసి, లైటు ఆర్పి మంచం మీద పడుకొన్నాను. కళ్లుమూసుకొని యెంత ప్రయత్నించినా, నిద్రమాత్రం పట్టలేదు. అంత బలవంతంగా నిద్రతెచ్చుకొని పడివుండటం నాకు యేమాత్రంకూడా యిష్టంలేదు. అందుకని లేచి లైటు వేసి, కుర్చీలో కూర్చున్నాను. అప్పటికే ఒంటిగంటయింది. ఏదయినా కథ వ్రాద్దామని కలం, పుస్తకంతీసి, వ్రాయడానికుపక్రమించాను. కాని, యేంవ్రాయాలో, యెటువంటి కథ వ్రాయాలో ఆలోచించేందుకే నా మెదడు నాతో సహకరించలేదు. దానితో కలం టేబిలుమీదపెట్టి కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాను. ఆవేళ పౌర్ణమనే విషయం నాకప్పుడే తెలిసింది. తెల్లని వెన్నెలతో వీధంతా పిండారబోసినట్టుగా వుంది. వెన్నెల అంటే నాకెంతో సంతోషం. వెన్నెలను చూస్తూంటే యెందుకో నాకెంతో ఆనందంకలుగుతుంది. యిక ఆకలి, నిద్రల మాటే మరచిపోతాను.

యిక ఒక్కక్షణంగూడా గదిలో వుండలేక పోయాను. తలుపు తాళంవేసి వీధిలోనికి బయలుదేరాను. ఎక్కడకు, యెందుకు వెళ్ళాలో నాకే తెలియదు. ఆ పంతు వెన్నెలలో యేమీ ఆలోచన లేకుండానే పిచ్చిదానిలా చాలా దూరం వచ్చేసాను. అలా ఎంతో దూరం నడిచాక నాకు స్పృహవచ్చినట్టయింది. అప్పటికప్పుడే వూరిచివర స్మశానం వరకూ వచ్చేశాను. నాకు స్మశానం అంటేనూ, దయ్యాలు అంటేనూ యేకొంచెమో భయంవుంటే అది నా చిన్నప్పుడేపోయింది. అప్పటికి చాలా దూరం నడిచానేమో, కాళ్ళుకూడా లాగుతున్నాయి. అందుకని స్మశానంలోనే ఒక సమాధిమీద కూర్చున్నాను.

అలా పదినిమిషాలు కూర్చొని వుండేటప్పటికి, ఆ నిశ్శబ్దంలో చిన్న ధ్వని బయలుదేరింది. అప్పుడు నాకే మాత్రం భయం వేయలేదుగాని, ఎంతో ఆశ్చర్యం ఆతృతా కలిగాయి. ధ్వని యెటునుండి వస్తూందో అని చెవులు నిక్కించి చూస్తూన్నాను. అమాంతంగా నేను కూర్చొనివున్న సమాధి కదిలినట్లయింది. మరుక్షణంలోనే ఒక 'నీడ' నా యెదురుగుండావచ్చి నిలబడింది. "ఎవరు నువ్వు?" అని నేను అడిగేనుందే ఆ 'నీడే' నన్ను ప్రశ్నించింది. మొదట ఆ 'నీడ'ను చూస్తూ నేనంత ఖచ్చితంగా నిర్ధారణచేసుకోలేకపోయినా, ఆ కంఠ ధ్వనినిబట్టి వెంటనే తెలిసిపోయింది. అదొక స్త్రీ 'నీడ' అని, వయస్సు పాతికకు మించివుండదనీ, ఆ కంఠ స్వరాన్నిబట్టి పోల్చుకున్నాను.

నేను వెంటనే యేమీ సమాధానం చెప్పకపోవడంతో మళ్ళా ప్రశ్నించింది. ఈ సారి ఆ కంఠంలో మొదట వున్నంత కఠినత్వమూ, బిగ్గరధ్వనీ లేకపోయినా సూటిగా మాత్రం ప్రశ్నించింది.

"నేనొక రచయిత్రిని. పత్రికలకు కథలు వ్రాస్తూంటాను" అని సమాధానం చెప్పాను. "రచయిత్రి" అనేమాట వినగానే ఆ 'నీడ' ముఖంలో కొంచెం

మందహాసం కనుపించింది. ఎంతో చనువు వున్న దానిలా నా ప్రక్కకువచ్చి కూర్చుంది. ఆ సమయంలో మరో మానవమాత్రు డెవరయినా అయితే ఎంతో భయపడివుండేవాడేమో గాని, నాకు మాత్రం యేమీ భయం లేకపోయింది. 'భయం' అనే వస్తువు నాలో యేకొంచెమేనా వుంటే అది నా చిన్నప్పుడే పోయిందని ముందే చెప్పానుగా? ఆమెను గురించి, ఆమె జీవితం గురించి తెలుసుకోవాలని నాకా క్షణంలో ఎంతో ఆతృత జనించింది. అందుకని ఆమె ముఖంలోకి చూస్తూ సూటిగా ప్రశ్నించాను.

"ఎవరు నువ్వు?"

నా ప్రశ్నకా 'నీడ' ప్రశాంతంగా నా వైపు చూస్తూ "చెల్లీ! నేనెవర్నో తెలుసుకోవడంవల్ల నీకు కలిగే లాభంయేంటి? నేనూ నీలాగే ఒక 'వనిత'ను. కాని, నీలా నేను రచయిత్రిని మాత్రం కాదు. నాకు నీలా శరీరం లేదు. నీవలె మానవుల్లో మళ్ళా కలువలేను." అంది కొంచెం విచారంతో కూడిన కంఠస్వరంతో. ఈ మాటలు విన్నాక, ఆమె చరిత్రయేమిటో తెలుసుకోవాలనే వుత్సాహం నాలో మరీ యెక్కువయింది.

"నేనేం మగవాడిని కాదుగదా? నీ చరిత్రంతా నాతో చెప్పడానికెందుకు సంకోచిస్తావ్? ... ... పోనీ, నీ కంత కష్టంగావుంటే."

నేను మాట పూర్తిచేయకుండానే అంతా గ్రహించి మధ్యలోనే అందుకొంది. "నీవే మగవాడవయివుంటే యింతసేపూ యీ సమాధిపై కూర్చోనిస్తానా చెల్లీ! పవిత్రమయిన నా సమాధిని వారి పాపపు చేతులతో తాకనిస్తానా? ... ... ... నా చరిత్రంతా వినడంవల్ల నీకే మాత్రం సంతోషంగాని; ఆనందంగాని దొరకదు. తుదినుంచి మొదటివరకూ నా దొక హృదయ విదారకమయిన దీన చరిత్ర. వినాలని నీ కంతగా కుతూహలంగావుంటే చెప్తా విను! కాని నీకు యిందువల్ల విచారంతప్ప, మరేం దొరకదు విను!"

"ఈ పాపపు ప్రపంచములో ఆడదిగా జన్మించడమే మహా పాపం. అందులోనూ పంచమహాపాతకాలూ చేసుకొంటేనే గాని భూమిమీద జన్మించగానే తల్లిని కోల్పోరు.

సరిగ్గా నా బ్రతుకిలాగే జరిగింది. నేను పుట్టిన మూడు రోజులకే మా అమ్మ ప్రసూతి రోగంచేత చనిపోయింది. మా నాన్నకు అమ్మమీదవుండే ప్రేమ కొద్దీ ఎంతో కృశించిపోయాడు. అతడు భార్యను యెంతగా ప్రేమించాడంటే అది చెప్పడం మహా కష్టం. ఒక్క క్షణం ఆమెను చూడలేకపోతే వుండలేకపోయేవాడట. భార్యపోయిన విచారంతో కొంత కాలం దుఃఖించిన తరువాత మా నాన్న సరిగ్గా మా అమ్మ పోలికలోనే వున్న నన్ను చూచి తన విచారాన్ని కొంచెం కొంచెం మరచిపోయేవాడు. నన్నెంతో గారాంతో చూచేవాడు. నేను కోరే యేవస్తువయినా సరే, మరుక్షణంలో నా చేతిలో పడితీరాల్సిందే. అంత అల్లారు ముద్దుగా ఐదేండ్లప్రాయం వరకు పెరిగాను.

అప్పటినుండే నా జీవితంలో దుర్దినాలు ప్రారంభించాయి. క్రమక్రమంగా మా నాన్న, మా అమ్మను మర్చిపోయాడు. దానితో మా నాన్నకు నాయందుగల ప్రేమగూడా కొంచెం కొంచెం సన్నగిల్లసాగింది. అదే సమయమని మా చుట్టాలు పక్కాలు అంతా ఎన్నో విధాలచెప్పి మా నాన్నకు మళ్ళా పెళ్ళికి నిశ్చయించారు. యధావిధిగా పెళ్ళి జరిగిపోయింది. అలా జరగడంవల్ల మా నాన్న చాలా సుఖించాడేమో గాని, నేను మాత్రం పూర్తిగా దుఃఖసముద్రంలో మునిగిపోయాను.

ఆమె హృదయం యెటువంటిదయినప్పటికీ ఆమె మాత్రం మంచి అందగత్తె అని చెప్పడంలో యే మాత్రం అతిశయోక్తివుండదు. మంచి తెలివయినది. గొప్ప చమత్కారిగూడా. మా నాన్న ఆమె సౌందర్యాన్ని చూచి పెళ్ళయిన మరుక్షణమే ఆమెకు దాసుడయిపోయాడు. పెత్తనం అంతా ఆమె చేతిమీదుగానే జరిగేది. ఆమె చెప్పిందే వేదాక్షరం. ఆమె

మాటకు అడ్డులేదు. ఎటువంటి పనయినప్పటికీ తత్క్షణం జరిగితీరాల్సిందే. అందుకని మా నాన్న గూడా యేమీసంకోచించేవాడుగాదు.

ఈ విధంగా రోజులు, నెలలు సంవత్సరాలు గడచిపోతూన్నెయ్. నేను కొంచెం పెద్దదానయ్యాను. అప్పటికి మా నాన్నకు ఒక మగపిల్లవాడుకూడా కలిగాడు. ఇక యింట్లో చాకిరీ అంతా నా మీద పడింది. మా సవతి తల్లి అంతకుముందు యింట్లో వుండే దాసీదాన్నిగూడా మాన్పించేసింది. ప్రొద్దుటే యింకా కాకులు లేవకుండా లేవాలి. వీధివాకలీ, దొడ్డివాకలీ తుడిచి కళ్లాపు జల్లాలి. ఆ తరువాత యిల్లంతా నేనే వూడ్చాలి. అదయిన తరువాత వంట గదిలోనికిపోవాలి. యెనిమిది గంటలయ్యేటప్పటి కల్లా యేదో ఒక ఫలహారం, కాఫీ తయారుచేయాలి. మళ్ళా వెంటనే మధ్యాహ్నం భోజనాలకు వంట ప్రారంభించి పన్నెండు కాకుండా రెండు కూరలూ, నాలుగు పచ్చళ్ళు మరో వేపుడుతోసహా తయారు చేయాలి. అందరి భోజనాలూ అయ్యేటప్పటికి మధ్యాహ్నం రెండుగంటలయ్యేది. అప్పుడు అంతా తినగా మిగిలిన వేవయినావుంటే తినేదాన్ని. ప్రొద్దుటనుండీ ఒక్క నిముషంగూడా విశ్రాంతి లేక పోగా, మధ్యాహ్నం కొంచెంసేపు నడుంవాల్చడానికి గూడా తీరికవుండేదిగాదు. మళ్లా మూడు గంటలకు కాఫీలు తయారు చేయాలి. ఆ తరువాత సాయంత్రం వంట చీకటిపడకుండా తయారు కావాలి. భోజనా లయ్యాక అన్నీ సర్దుకొని పడుకొనేటప్పటికి రాత్రి పదకొండయ్యేది.

ఈ విధంగా ప్రతి రోజూ వూపిరితీసుకోడానికి గూడా తీరిక లేకుండా చాకిరీచేస్తూన్నా ఒక్క మెప్పూ, ముద్దూ యేమీ లేదుగదా. కాఫీ కొంచెం ఆలశ్యం అయినా, భోజనంలో రకాలు తక్కు వయినా చీవాట్లేకాకుండా తన్నులుగూడా తగి లేవి. "పోతులా వున్నావు. చేయలేవా ? పంది ముండా !" అంటూ యింకా బండతిట్లన్నీ తిడుతూ మా సవతి తల్లి చావగొట్టేది. నోరువిప్పి యెదురు చెప్పడానికి వీలులేదు. నన్ను చూచి మా నాన్న గూడా మరేం మాట్లాడేవాడుగాదు. యిక ఆ యింట్లో మా సవతి తల్లి మాటకు అడ్డులేదు.

ఈ విధంగా కాల ప్రవాహం నడచిపోతూనే వుంది. నాకు ఒక్కొక్క సంవత్సరమే వయస్సు పెరుగుతూంది. ఎంత బండచాకిరీ చేస్తూన్నా, యెన్ని దెబ్బలు తింటూన్నా నాకు పదిహేనవ సంవత్సరం వచ్చేటప్పటికల్లా నిండు యవ్వనం వచ్చికూర్చుంది.

నా చిన్నప్పుడు మా నాన్న నాకు మంచి సంబంధం చూస్తానని కబుర్లు చెప్పేవాడు. ఆ విధం గానే తన మాట ప్రకారం మా నాన్న సంబంధం కుదిర్చి యింటికొచ్చాడు. పెండ్లికొడుకు బి. ఏ. పాసయ్యాడట. మంచి బుద్ధిమంతుడట. సంబంధం మంచిదని అందరూ అన్నారు. కాని దేవుడు నా నొసట ఒకలారాస్తే మరోలా యెలా జరుగుతుంది! మా సవతి తల్లి "ససేమిరా" అంది. నన్ను తన తమ్ముడికితప్ప మరెవ్వరికీ చేయడానికి వీలులేదంది.

యిక ఆ యింట్లో ఆమె మాటకు అడ్డుచెప్పగలిగే వారెవరు ? ఆమె కోర్కె ప్రకారమే జరిగిపోయింది.

అలా జరిగినందుకు నేను యే మాత్రం విచారించ లేదుగూడా. ఆ సమయంలో నాకు భర్తను గురించి గాని, ప్రేమ గురించిగాని అంత యెక్కువగా తెలి యదు. అపుడు నాకు కావలసింది పెళ్ళే. ఎందు కంటే ఆ బండచాకిరీ, తిట్లూ, దెబ్బలూ తప్పి మరో యింటికిపోవచ్చు. యెంత నరకమయినప్పటికీ యీ బానిస జీవితం అంత కష్టంగా వుండదనేవిషయం అపుడు నాకు బాగాతెలుసు.

ప్రపంచములో అందరు స్త్రీలు, తమ భర్తలను గురించి యేవిధంగా తలుస్తారో, నేనుగూడా అలాగే తలిచాను మొదటిసారిగా అత్తవారింటికివచ్చేటప్పుడు దీర్ఘకాలం ఖైదుజీవితం అనుభవించిన తరువాత విడుదలై ప్రపంచములోనికివచ్చే ఖైదీలాగ ఎంతో సంతోషించాను. వెళ్ళిన ఒక నెలవరకూ చాలాకులా సాగావున్నాను. మావారపుడు నన్నెంతో ప్రేమించే వారనుకొనేదాన్ని. ఎలాఅయినప్పటికీ ఆ నెల

రోజులా నేను స్వర్గంలో విహరించానంటే నమ్మ చెల్లీ! కానీ మబ్బులన్నీ చంద్రుణ్ణి మూసేసి నట్టుగా నా ఆనందజీవిత ద్వారాలన్నీ వాటికవే మూసుకపోయినవి. అప్పటినుండి నా జీవితచక్రం మామూలు కష్టాలబాటలోనే పడిపోయింది.

మా వారు యింటిలో ఒక్క క్షణం వుండేవారు గాదు. భోజనానికి మాత్రం వచ్చేవారు. మళ్ళా వెంటనే వెళ్ళిపోయేవారు. రాను రాను రాత్రిళ్ళు గూడా యింటికి రావడం మానేశారు. నాతో అసలే మాట్లాడేవారుగారు. మా వారిలో అకస్మాత్తుగా కలిగిన యీ మార్పు చూస్తూంటే నాకు మొట్టమొదట యెంతో ఆశ్చర్యం వేసింది. కొన్ని రోజులు గడిచే టప్పటికి అసలు విషయం అంతా తెలిసింది. వారికి అంతకుముందే 'వుంపుడు కత్తె' ఒకతె వుందట. సానివాళ్ళయిళ్ళు మరిగిన మగవారి ప్రవర్తన గురించి వేరే చెప్పాలా చెల్లీ! రోజులు గడిచేకొద్దీ వారి ప్రవర్తన మరీ విపరీతం అయిపోయింది. ప్రపంచ ములోవుండే సకలమైన దురలవాట్లూ వారిని చుట్టు ముట్టాయి. ఒకొక్కక్క రోజున వారు బాగా త్రాగి వళ్ళు తెలియకుండా యింటికి వచ్చేవారు. నన్ను గదిలోపెట్టి గొడ్డును కొట్టినట్టుగా కొట్టేసేవారు. ఆ తరువాత నా దగ్గరవున్న వస్తువులు తీసుకొని వెళ్ళి పోయేవారు.

ఎంత దుర్మార్గులయినా అగ్నిసాక్షిగా పెండ్లా డిన భర్త హిందూ ధర్మశాస్త్ర ప్రకారం భార్యకు సాక్షాత్ భగవంతుడేగదూ? ఎన్నడూ వారిని పల్లెత్తుమాట అనలేదు.

ప్రపంచములో అందరి గురించి నాకంతగా తెలి యదుగాని నాకు తెలిసినంతవరకూ మా వారివంటి అనుమానపు మనిషిని నేను యెక్కడా చూడలేదు. ఈ విషయంగూడా నేను ఆఖరు గడియలలోనే తెలుసుకొన్నాను.

ఆ నాడు మా నాన్నగారి దగ్గరనుండి ఒక నౌఖరు వచ్చాడు. ఆ సాయంత్రం దీపాలు పెట్టిన తరువాత ఆ నౌఖరును నా గదిలోనికి పిలచి మాట్లాడు తున్నాను. ఆ నౌఖరు చాలా మంచివాడు. ఎంతో కాలంనుండి మా నాన్న దగ్గర వుంటూన్నవాడు. అందుకనే యింటి దగ్గర అన్ని విషయాలు అడుగు తున్నాను. అదే సమయంలో మా వారు బాగా త్రాగి తూలుతూ గదిలో ప్రవేశించారు. రాగానే గదిలోవున్న నౌఖరును నన్ను ఒక్కసారి చూశారు. ... ... ... అంతకంటె నేను చెప్పలేను చెల్లీ! ... గొడ్డును కొట్టినంతకంటే యెక్కువగా కొట్టేశారు... స్పృహతప్పి పడిపోయాను ... అన్నీ తీసుకొనిపోగా మిగిలిన మంగళసూత్రం తెంపుకొని బయటగొళ్లెంపెట్టి వెళ్ళిపోయారు ... ...

ఆ మర్నాడు ప్రొద్దుటే నాకీ సమాధి చేయ బడింది. అంతా విన్నాక నేను నిశ్చేష్టురాలనై ఆ నీడవంకచూస్తూ అలాగే వుండిపోయాను. ఆ 'నీడ' ప్రశాంతంగా నిలబడి "చెల్లీ! యింత జరిగినా నాకేమీ అంత దుఃఖంలేదు. అంతా నా ఖర్మ. ... కాని ఆఖరు ఘడియలలో వారి హృదయం లోనే నొక 'కులట'గా పాతుకుపోయినందుకు కుమిలి, కుమిలి యేడుస్తున్నాను" అంటూ విచారంతో అక్కడ నుండి కదలిపోయింది.

విచారంతో నేనొక వేడినిట్టూర్పు విడచి యింటికి బయలుదేరాను.

—X—